క్లుప్తంగా

సీఐ బాధ్యతల స్వీకరణ


జయచంద్ర సీఐ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ కు ఏర్పేడు నుంచి బదిలీపై వచ్చిన సీఐ జయచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శరత్ చంద్ర వీఆర్‌కు బదిలీ చేయడంతో ఆ స్థానంలో జయచంద్ర బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల విషయంలో ఎటువంటి రాజీలేకుండా పనిచేస్తానని ఆయన తెలిపారు.

కుల వివక్ష నేరం


మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై కులవివక్ష చూపితే చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై అవగాహన ఉండాలన్నారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్పంచ్ వెంకటమ్మ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం, కృష్ణాపురం ఎస్సీ కాలనీలో బుధవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, వీఆర్వో సాయి కృష్ణ సివిల్ రైట్స్ డే ప్రత్యేకతను వివరించి హక్కుల గురించి అవగాహన కల్పించారు.

లోఓల్టేజీతో సతమతం


మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బీఎంసీ వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైంది. ఈ కారణంగా వినాయక, వాటర్‌ప్లాంట్, గ్రామీణ బ్యాంకు వీధులలో గ్రామస్తులు లోఓల్టేజీ సమస్యతో సతమతం అవుతున్నారు. లోఓల్టేజీ సమస్యతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వివిధ రకాల విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెక్ పోస్టు తనిఖీ


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా వాహనాల తనిఖీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీ సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఇతర మార్గాల ద్వారా ఆంధ్రాలోకి ప్రవేశించే వారిపై నిఘా వేయాలని, కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు.

మైనారిటీలకు రాయితీ రుణాలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి సబ్సిడీ పథకాల బ్యాంకు రుణాల మంజూరుకు అర్హులైన మైనారిటీలు, క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం కార్యనిర్వాహక సంచాలకులు హరినాథరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 625 యూనిట్లు జనాభా ప్రకారం ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. తెల్లరేషన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పరిధిలో నివాసం ఉన్నవారు, 21- 55 ఏళ్ల లోపు, తహసీల్దార్ నుంచి పొందిన మైనారిటీ సర్టిఫికెట్ జెరాక్స్‌లు దరఖాస్తుకు జతచేయాలని చెప్పారు. ఈ నెల 25వరకు దరఖాస్తులకు గడువు ఉందని స్పష్టం చేశారు.

పుష్పయాగానికి అంకురార్పణ రేపు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 3న జరుగనున్న పుష్పయాగం సందర్భంగా శుక్రవారం అంకురార్పణ జరుగనుంది. గృహస్తులు ఇద్దరు రూ.1000 చెల్లించి పుష్పయాగంలో పాల్గొనవచ్చు.

ఉపాధి నిర్లక్ష్యం


వరదయ్యపాళెం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలాల వారీగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత, కూలీల వివరాలు ఇలా..

మండలం	ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీల సంఖ్య	జాబ్ కార్డులు	కూలీలు
వరదయ్యపాళెం	06	7305	5707
బీఎన్‌కండ్రిగ	01	7690	1200
కేవీబీపురం	13	9224	2200
నారాయణవనం	05	7424	1613
పిచ్చాటూరు	05	6207	10750
నాగలాపురం	04	5969	9551
సత్యవేడు	01	7875	2152

నిరుపేదల ఉపాధి కల్పన కోసం చేపట్టిన ఉపాధిహామీ పథకానికి సిబ్బంది కొరత వేధిస్తోంది. గతంలో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కారణాలతో కొందరిని తొలగించింది. మరికొందరు అవినీతి పనులతో సస్పెన్షన్‌కు గురయ్యారు. అయిదేళ్లుగా ఖాళీ ఏర్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆ గ్రామాల్లో పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలంటూ పదే పదే ఒత్తిడి తెస్తున్నా క్షేత్రస్థాయిలో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలనే విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించక పోవడం గమనార్హం.

- సిబ్బంది లేక ఇబ్బందులు
- ఖాళీగా ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు
- మందకొడిగా ఉపాధిహామి పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకానికి సిబ్బంది కొరత కారణంగా పనుల్లో జాప్యం నెలకొంది. నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ, కేవీబీపురం, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు ఏడు మండలాల్లో 35 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో కూలీలకు పనులు కల్పన ఆలస్యమవుతోంది. నియోజకవర్గ పరిధిలో 51,694 జాబ్ కార్డులు ఉండగా వీటి ద్వారా 33,173 మంది కూలీలు ఉన్నారు. వీరిలో ఏటా ఉపాధి ద్వారా 100 రోజుల పనిదినాలు సద్వినియోగం చేసుకునే కూలీలు సుమారు 6 వేల మంది ఉన్నారు. అయితే 35 గ్రామ పంచాయతీల్లో ఉపాధి సిబ్బంది లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఊసేలేని నియామకాలు

నియోజకవర్గ వ్యాప్తంగా 35 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం ఊసే లేకుండా పోయింది. గత ఏడాది నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో నియామకం కోసం ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు సూచించారు. అయితే నియామకాలు కోసం స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

లక్ష్యం సుదూరం

నియోజకవర్గంలోని ఒక్క కేవీబీపురం మండలంలో 13 మంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలగించిన వారు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని నేరవేర్చకపోవడంలో వెనుకడుగు, కొన్నిచోట్ల అవినీతి పనులు చేపట్టిన కారణంగా పలువురిని తొలగించారు. అలాగే వరదయ్యపాళెం మండలంలో కూడా 6 పంచాయతీలలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పనులు కల్పించండి



ఉపాధి హామీ ద్వారా వెంటనే పనులు కల్పించాలి. గడిచిన మూడేళ్లుగా తమ పంచాయతీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం జరగలేదు. అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. నాలుగేళ్లుగా తమ పంచాయతీలో పనులు జరగక ఉపాధి కూలీలు పస్తులతో అలమటిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి పనులు జరిగేలా చూడాలి. –సునీల్, ఇందిరానగర్, వరదయ్యపాళెం మండలం

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి



గ్రామస్థాయిలో ఖాళీగా ఉన్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ప్రస్తుత వేసవి రీత్యా పనులు జరిగేందుకు వీలుగా క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు కీలకం. అలాంటి పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం చేయొద్దు. తక్షణమే నియమించి పని దినాలు పెంచడంతో పాటు వేగవంతంగా పనులు చేపట్టాలి. –దుద్దు వేణు, సర్పంచ్, సీఎల్ఎన్‌పల్లి, వరదయ్యపాళెం మండలం

నోటీస్ బోర్డు

నేడు పింఛన్ల పంపిణీ

నాగలాపురం: మండలంలో మే నెల 1వ తేదీ గురువారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తారని తెలిపారు.

జాతరకు సర్వం సిద్ధం


గాజుల మండ్యం జాతరలో విద్యుత్ కాంతులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని నడివీధి గంగమ్మ జాతర మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. గ్రామంలో చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. గురువారం జరిగే జాతర విశేషాలను ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు. గ్రామంలో జరిగే గంగమ్మ జాతరకు వందల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. తిరుపతి గంగమ్మకు పుట్టినిల్లుగా భావించే గాజుల మండ్యంలో మొదటగా జాతర నిర్వహించి ఇక్కడ నుంచి పసుపు కుంకుమ అవిలాల గ్రామంలోకి తీసుకొని వెళ్తారన్నారు. అవిలాల జాతర రోజున తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు చాటింపు వేస్తారని గ్రామస్తులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున గంగమ్మ ప్రతిరూపాన్ని నడివీధిలో నిలిపి, ఉదయం అంబలి, పొంగళ్లు సమర్పించి రాత్రికి అమ్మవారిని గ్రామంలో ఊరేగించి గంగలో కలపడంతో జాతర మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ఊరేగింపులో వినాయకుడు

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. గురువారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు, అర్చకుడు రమేష్ గురుకల్ తెలిపారు. సాయంత్రం మరగదవల్లీ, అగస్త్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులు తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో ఊరేగారు. అనంతరం యాగశాలలో హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం సముదాయం గ్రామ వీధుల్లో వాహన సేవలను నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు. మే నెల 2న శుక్రవారం సాయంత్రం సింహవాహనం, 3న హంస వాహనం, 4న శేషవాహనం, 5న సోమవారం నంది వాహనం, 6న గజ వాహనంపై ఉత్సవర్లు సముదాయం గ్రామ వీధుల్లో విహరిస్తారు. 7న బుధవారం రాత్రి రథోత్సవం, 8న గురువారం సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనం, 9న శుక్రవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై ఉత్సవర్లు విహరిస్తారు. 10న శనివారం ఉదయం కైలాసనాథ కోనలో త్రిశూల స్నానం అనంతరం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

అసత్య ఆరోపణలు తగదు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్ఆర్‌సీపీపై, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు కొణతనేని మణినాయుడుపై కాటూరు ఎంపీటీసీ సభ్యుడు రవి అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని కాటూరు పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. వారు బుధవారం కాటూరు పరిధిలోని వీయస్‌పురం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణినాయుడు కాటూరు ఎంపీటీసీ పరిధిలో నెలటూరు రవికి పార్టీ బీ ఫామ్ ఇప్పించి నాయకులు, కార్యకర్తలను ఏకతాటి పైకి తెచ్చి గెలిపించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తితో కలసి పార్టీపై , మణినాయుడుపై విమర్శలు చేయడం తగదన్నారు. మణినాయుడు మండలంలో వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవం కోసం కష్టపడి పనిచేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై ఆరోపణలు దారుణమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణయ్య, వెంకట కృష్ణయ్య, కిరణ్‌యాదవ్, నాగలాపురం కృష్ణయ్య, కడివేటిముని, మునిసుబ్బయ్య, సిద్ధయ్య, పోలమ్మ, అశోక్, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన రైతులతో పాటు, కృష్ణాపురం గ్రామ రైతులకు బుధవారం పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార పదార్థాలను తింటే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేసిన రైతుల అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, ప్రజా ప్రగతి ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు, ఏఏఏ సంస్థ సభ్యులు మోహన్, ట్రస్టు పాజెక్టు మేనేజర్ నాగరాజు, సిబ్బంది సుబ్రమణ్యం, సుధీర్ గాంధీ, ఓంకార్, తిరుపాల్, దేవేంద్ర పాల్గొన్నారు.

చేతివృత్తులతో స్వావలంబన


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి చేతి వృత్తులు ఎంతగానో తోడ్పడుతాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్‌లోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిమూలం శిక్షణ తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం ఆర్థికంగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీడీఓ గుణశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ డాక్టర్ వేణయ్య, జిల్లా కోఆర్డినేటర్లు పద్మ, సుమతి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ

నాగలాపురం: పిచ్చాటూరు, నాగలాపురం మండలాలను కలిపే నారాయణరాజు కండ్రిగ వద్ద గల గొడ్డేటి వాగు వంతెన నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమి పూజ చేశారు. అక్కడ నుంచి వేంబాక్కం పంచాయతీలోని గోపాలపురంలోని మరో బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గతేడాది కురిసిన వర్షాలకు కూలిపోయి రెండు మండలాల ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో నాయకులు ఇలంగోవరెడ్డి, శ్రీనివాస యాదవ్, సెల్వకుమార్, ఎస్.ఎం.సురేష్, మురళి, శ్యామ్, గోకుల్ నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ రోడ్డు ఆక్రమణకు యత్నం


ఆక్రమణకు యత్నించిన పంచాయతీ రోడ్డు ఇదే..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని మంచినీళ్ల గుంట సమీపంలోని రైల్వే పెన్షనర్స్ కార్యాలయం ముందు ఉన్న పంచాయతీకి చెందిన సీసీ రోడ్డును ఆక్రమించేందుకు యత్నించగా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీ రోడ్డుకు మాజీ వార్డు సభ్యులు రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకుని రావడంతో అందరూ అవాక్కయ్యారు. ఈ విషయంపై బుధవారం ఎంపీడీఓ విష్ణు చిరంజీవికి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

సత్యవేడులో ప్రశాంతంగా పాలిసెట్

సత్యవేడు: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో బుధవారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషాదేవి, చీఫ్ సూపరింటెండెంట్ ప్రసూన, రిజ్వానా తెలిపారు. 300 మంది విద్యార్థులు దరఖాస్తులు అందించగా 240 మంది పరీక్షకు హాజరయ్యారు. బాలురు 174, బాలికలు 66 మంది ఉన్నారు. అబ్జర్వర్‌గా కృష్ణమూర్తి, స్క్వాడ్ అధికారిగా లక్ష్మీపతి విధుల నిర్వహించారు.

ముగిసిన మహా కుంభాభిషేక వేడుకలు


గ్రామస్తులతో బియ్యపు శ్రీవాణి రెడ్డి

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం పాపానాయుడుపేట మర్రిమంద గ్రామంలోని శ్రీ లక్ష్మీహయగ్రీవ స్వామి మహాకుంభాభిషేక పూజలు బుధవారం ముగిశాయి. ఆలయంలో అయిదు రోజులుగా జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాల్లో చివరి రోజు జరిగిన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉడిపి పీఠాధిపతి పాదయాత్ర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఉడిపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఈష ప్రియ తీర్థ స్వామివారు నిర్వహిస్తున్న భారతదేశ పాదయాత్రలో భాగంగా బుధవారం రాత్రి గాజుల మండ్యం పంచాయతీ బాలాజీ కాలనీకి చేరుకున్నారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జీపాల్యం తేజోవతి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాలనీలోని స్థానికులతో సమావేశమయ్యారు. అనంతరం రేణిగుంట ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి ఆలయంలో బస చేసి గురువారం ఉదయం 10:30 గంటలకు భక్తులకు వారి సందేశాన్ని వినిపించనున్నారు. కార్యక్రమంలో ఇందు కుమార్ రెడ్డి, కష్టారెడ్డి, శ్రీకష్ణ భజన బందం పాల్గొన్నారు.


కాలనీ వాసులతో ఉడిపి పీఠాధిపతి


అడవిలో మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

అడవికి నిప్పు బాధాకరం

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలంలోని శేషాచలం అడవులలో మూడు రోజులుగా మండుతున్న మంటలను బుధవారం అటవీశాఖ డీఆర్ఓ సికిందర్ బాబు ఆధ్వర్యంలోని ఫారెస్ట్ సిబ్బంది అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలతో అడవికి నిప్పు పెట్టడం బాధాకరమన్నారు. బీట్ అధికారులు పురుషోత్తం, శోభారాణి, ప్లాట్ వాచర్ పొన్నారెడ్డి, 15మంది వన సంరక్షణ సమితి సభ్యులు మంటలు అదుపు చేసేందుకు కృషి చేశారని అన్నారు.

హోర్డింగుల జోరు.. జనం బేజారు


ఫ్లై ఓవర్ ముందు ఏర్పాటు చేసిన హోర్డింగు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుమల-తిరుపతి ముఖద్వారం అయిన రేణిగుంటలో హోర్డింగుల జోరు కొనసాగుతోంది. ఎవరికి తోచిన విధంగా వారు బ్యానర్లు వేసుకుంటున్నారు. ఎక్కడైనా ఇవి కూలీ జనంపై పడే ప్రమాదాలు కూడా ఉన్నాయి. వాటి నిర్వహణ ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే గత ప్రభుత్వంలో ఏడాదికి లక్ష రూపాయలు హోర్డింగులకు చెల్లించేవారు. కానీ గడిచిన 10 నెలల్లో పంచాయతీకి వాటి వల్ల రూపాయి ఆదాయం కూడా రాలేదు. పంచాయతీ అధికారులు మాత్రం అది మాకు సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తున్నారు. రేణిగుంట ఫ్లై ఓవర్‌కు అటు, ఇటు ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ హోర్డింగులు ఉన్నాయి. వాటి నిర్వహణ బాధ్యతలు ఎవరు తీసుకుంటున్నారనేది పంచాయతీ అధికారులకు సైతం తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉంది. దీనిపై ఈఓ మణిని వివరణ కోరగా.. హోర్డింగుల నిర్వహణ ఎవరు చూస్తున్నారో తనకు తెలియదని, గతంలో ఉన్న గుత్తేదారుతో మాట్లాడి వాటికి వేలం పెట్టించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డీటీ సేవలు ఆదర్శం


ఉద్యోగ విరమణ చేసిన డీటీని సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: డిప్యూటీ తహసీల్దార్‌గా రెవెన్యూ శాఖలో వెంకట సుబ్బయ్య సేవలు మరువలేనివని కేవీబీపురం తహసీల్దార్ మునిరత్నం తెలిపారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన వెంకట సుబ్బయ్యకు వరదయ్యపాళెంలోని కేబీజీ కళ్యాణ మండపంలో వీడ్కోలు సభను నిర్వహించారు. ఆర్ఐగా, డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటసుబ్బయ్య ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని అతిథులు కొనియాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ముందుగా జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీ నాయకులు వెంకటసుబ్బయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, మండల సర్వేయర్ వెంకట రమణ, బీఎస్‌కండ్రిగ మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా, బీఎస్‌కండ్రిగ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, దశరథ ఆచారి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీ రాయల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉద్యోగ విరమణ మహోత్సవ వేడుకను ఏఈఓ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనకు వైస్సార్‌సీపీ సర్పంచ్ చిన్నదొరై సుధా నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి చెంగల్ రాయులు, ప్రధాన అర్చకుడు నాగరాజు బట్టాచార్యులు, షరాబు ఉదయ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

